
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
బుధవారం 14 ఆగస్టు 2024

కోల్ రైల్‌కు సై



- ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేంద్ర రైల్వేశాఖ మంజూరు
- రైల్వే లైన్‌లతో పెరగనున్న రవాణా, కనెక్టివిటీ
- కాజీపేట - భూపాలపల్లి లైన్ ప్రస్తావన కరువు


7



ఇటీవల కేంద్ర రైల్వేశాఖ ప్రకటించిన కొత్త రైల్వే ప్రాజెక్టులు ఓరుగల్లుకు భారీ ప్రయోజనాన్ని చేకూర్చనున్నాయి. కోల్‌బెల్ట్ ప్రాంతమైన రామగుండం నుంచి భూపాలపల్లి, ములుగు మీదుగా మణుగూరు వరకు నిర్మించే రైల్వేలైన్ బొగ్గు సరఫరాతో పాటు పర్యాటక అభివృద్ధిలో కీలకం కానుంది. అలాగే డోర్నకల్ జంక్షన్ నుంచి మిర్యాలగూడ, గద్వాల వరకు వేర్వేరు రైల్వేలైన్లు ఇతర తూర్పు, దక్షిణ రైల్వేలైన్లతో కనెక్టివిటీని పెంచటంతో పాటు బొగ్గు, బియ్యం, గ్రానైట్ తదితర వాటిని సరఫరా చేసే విధంగా కొత్త రైల్వే కారిడార్ అభివృద్ధికి అడుగులు పడనున్నాయి. అయితే కాజీపేట రైల్వే డివిజన్‌తో పాటు కాజీపేట - భూపాలపల్లి రైల్వేలైన్‌పై కేంద్రం ప్రకటన చేయకపోవటంపై ఓరుగల్లువాసుల్లో కొంత అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

హోటళ్లే అడ్డాగా..!



వరంగల్ క్రైం, ఆగస్టు 13: వరంగల్ మహా నగర శివారు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి. శివారులో వెలుస్తున్న పలు హోటళ్లే ఇందుకు అడ్డాలుగా మారాయి. ప్రధానంగా కేయూ, హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డుకు ఇరువైపులా వెలుస్తున్న హోటళ్లతో పాటు పరిసర ప్రాంతాల్లో హోటళ్లలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం. పేకాటతో పాటు అనధికారిక మందు పార్టీలు, వ్యభిచారం, ఇతరత్రా కార్యకలాపాలు జరుగుతుంటాయని తెలిసింది.

పోలీసుల వైఫల్యం

ఓఆర్ఆర్‌తో పాటు శివారు ప్రాంతాల్లో పలు దందాలు బహిర్గతమైనప్పటికీ స్థానిక పోలీసులు చూసీచూడనట్లు ఉంటున్నారని తెలుస్తోంది. నగర శివారులో ఉన్న ఈ హోటళ్లలో జరుగుతున్న దందాల గురించి పోలీసులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తారనే ప్రచారం ఉంది. పెట్రోలింగ్ పార్టీలు అటుగా చూడరనే విమర్శలున్నాయి. అయితే యాజమాన్యాలు ఇస్తున్న అమ్యామ్యాల మత్తులో పోలీసులు అటుగా కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. దందాలు బహిర్గతమైనప్పుడు హడావుడి చేయడం.. నామమాత్రపు చర్యలతో మమ అనిపించడం.. అలవాటుగా మారిందనే విమర్శలున్నాయి. ప్రధానంగా కేయూ, హసన్‌పర్తి పరిసర ప్రాంతాల్లో ఇటీవల పలు నూతన లాడ్జిలు వెలుస్తున్నాయి. ఈ లాడ్జీలు అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారినట్లు తెలిసింది. వీటిపై పోలీసులు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిచ్చినట్లు అవుతోంది.

కొన్ని ఘటనలు

- జూన్ 11వ తేదీన ఓఆర్ఆర్‌పై వెలిసిన ఒక లాడ్జిలో మహిళతో ఒక సీఐ అడ్డంగా దొరికిన విషయం బహిర్గతమైంది. ఈ సమయంలో పలు జంటలు ఆ లాడ్జిలో ఉన్నట్లు సమాచారం. సీఐని పట్టుకునే హడావుడిలో మిగతా రూముల్లో ఉన్నవారిపై దృష్టి సారించలేదు. ఈలోపు వారు పారిపోయినట్లు తెలిసింది. సదరు సీఐని పట్టుకున్నప్పటికీ అతడిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విశేషం.
- ఈనెల 6న ఓఆర్ఆర్ సమీపంలోని ఒక హోటల్‌లో తొమ్మిది మంది పేకాట ఆడు తూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబ డ్డారు. వీరి నుంచి రూ.1లక్ష 23వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబ డిన మొత్తాన్ని గమనిస్తే ఏ స్థాయిలో పేకాట ఆడుతున్నారో గమనించవచ్చు.
- ఓఆర్ఆర్‌పై ములుగు వెళ్లే దారిలో ఉన్న మరో హోటల్.. పేకాటకు, పంచా యితీలకు, ఇతరత్రా కార్యకలాపాలకు కేంద్రం మారినట్లు సమాచారం. ఈ హోటల్‌లో కొద్దిరోజుల కిందట పేకాట ఆడుతూ పలువురు పట్టుబడిన విషయం తెలిసిందే. వీరిలో సంపన్నులు ఉన్నట్లు తెలిసింది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని వారిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు.
- ఇక చింతగట్టు ప్రాంతంలో ఉన్న ఒక ఫామ్‌హౌస్‌లో ప్రతిపక్ష పార్టీకి చెందిన పలువురు పేకాట ఆడుతూ పట్టుబడి కోర్టులో జరిమానా కట్టిన విషయం తెలిసిందే.

- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా శివారు హోటళ్లు
- రింగ్ రోడ్డు ప్రాంతాల్లో యథేచ్ఛగా దందా
- మామూళ్ల మత్తులో పడి నిర్లక్ష్యం చేస్తున్న పోలీసులు
- సీపీ దృష్టి పెట్టాలంటున్న ప్రజలు

సీపీ దృష్టి పెట్టాలి



“ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నగరంలో నిత్యం తనిఖీలు చేస్తూ శాంతిభద్రతల పరిరక్షణపై చర్యలు చేపడుతున్నారు. అర్ధరాత్రిళ్లు రోడ్లపై తిరుగుతూ స్టేషన్‌లను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. అయితే నగరంలో జరిగే దందాలను అరికడుతున్న సీపీ.. శివారు ప్రాంతాల్లోని హోటళ్లలో జరిగే దందాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. హోటళ్లపై దాడి చేయడం, ఫామ్‌హౌస్‌లపై ప్రత్యేక నిఘా పెట్టడంలాంటివి చేయాలి. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిఘా పెంచితే తప్ప.. ఈ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడదు. ఇప్పటికైనా శివారు ప్రాంతాలు, ప్రధానంగా ఓఆర్ఆర్‌పై ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.



మాట్లాడుతున్న టి.రాజేశ్వర్ రావు, చిత్రంలో వెంకట నారాయణ, తదితరులు

హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలపాల్సిందే..

- విడదీయడంతో అస్థిత్వం కోల్పోతోంది..
- మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు
- వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణంపై చర్చ

కాజీపేట, ఆగస్టు 13: 'వరంగల్ నగరాన్ని ముక్కలు చేయడంతో అస్థిత్వం కోల్పోతోంది.. హనుమకొండ, వరంగల్ కేంద్రంగా వరంగల్ జిల్లాగా ఉంటే నే పూర్తిస్థాయి అభివృద్ధి జరుగుతుంది.. ఇప్పటికైనా పాలకులు చొరవ తీసుకుని హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలపాలి' అని వరంగల్ మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు కోరారు. హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమానగర్ బాలవికాసలో మంగళవారం 'వరంగల్ మహానగర ఏకీకరణ, పునర్నిర్మాణం' అనే అంశంపై చర్చ కార్యక్రమం జరిగింది. నిర్వాహకుడు పింగిళి సంపత్ రెడ్డి అధ్యక్ష తన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. ఆసియా ఖండంలోనే ప్రాధాన్యతను సంతరించుకున్న ఏనుమాముల మార్కెట్, అజంజాహి మిల్లు, ఎయిర్‌పోర్టుతో 1200 యేళ్ల చరిత్ర కలిగిన వరంగల్‌ను విడదీయడం బాధాకరం అన్నారు. వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడం న్యాయమైన డిమాండ్ అన్నారు. జిల్లాల ఏకీకరణ కోసం తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

అంతకుముందు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ మాట్లాడుతూ... హైదరాబాద్ స్థాయిలో ఎదుగుదల ఉండి పెట్టుబడులకు ఆకర్షణీయంగా ఉండే వరంగల్‌ను విడదీయడం దారుణం అన్నారు. తుగ్లక్ కూడా ఇలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. నాటి పాలకులు జిల్లాలను విడదీసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే రాజకీయ కుట్రే జిల్లాల విభజన అన్నారు. హనుమకొండ, వరంగల్ జిల్లాలను కలిపే విషయం ఎవరూ వ్యతిరేకించపోవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎవరినీనిందించడం కన్నా, దీర్ఘకాలిక అభివృద్ధి కోసం ఆలోచించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా ముందుకెళదామని తీర్మానించారు. తెలంగాణ ఉద్యమకారుడు జనార్దన్ మాట్లాడుతూ.. చవటలు, దద్దమ్మల్ల వల్లే ఈ విభజన జరిగిందన్నారు. అడ్డంకులు వస్తే కలిసికట్టుగా ఒక్కటై వరంగల్, హనుమకొండను ఏకం చెయ్యాలన్నారు. అనంతరం పిగిళి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ.. తాము ఎవరికీ వ్యతిరేకం కాదన్నారు. కేవలం వరంగల్, హనుమకొండ జిల్లాలను కలపడమే ధ్యేయం అన్నారు.

అంతకుముందు రైల్వే కార్మిక నాయకులు కర్ర యాదవరెడ్డి, దేవులపల్లి రాఘవేందర్, సామాజిక వేత్త పెద్ది వెంకటనారా యణ, కోండ్ర నర్సింగరావు, న్యూడెమొక్రసీ నేత అప్పారావు, కాంగ్రెస్ నాయకులు రావుల సదానందం, ఎం.డి.అంకూస్, జర్నలిస్టులు, రిటైర్డ్ టీచర్లు, అడ్వకేట్‌లు, ప్రొఫెసర్లు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వరంగల్, హను మకొండ జిల్లాలను కలపాల్సిందేనని, అందుకు మద్దతు ప్రకటిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్‌లో సీఎంని కలిసి వినతిపత్రం సమర్పించనున్నట్లు చెప్పారు.

కోటలో స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు



వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సత్యశారద

ఆస్పత్రి భవన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి

- కలెక్టర్ సత్యశారద

నర్సంపేట, ఆగస్టు 13: నర్సంపేట పట్టణ శివారులోని వైద్య కళాశాల భవనాన్ని కలెక్టర్ సత్యశారద సందర్శించారు. ఈ సందర్భంగా భవననిర్మాణ పనులను పరిశీలించారు. కంటి, ముక్కు, చెవి, మానసిక, చర్మ, ఎముకల, ఆర్థో, స్టమక్ వాష్ తదితర విభాగాల గదులను కలియ తిరిగి పరిశీలించారు. త్వరలో జిల్లా ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం చేసే అవకాశాలు ఉన్నందున మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో పనిచేసే వైద్యులు రోగులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఆస్పత్రి ప్రారంభం అయ్యాక రోగుకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం కలిగించాలని వైద్యులకు కలెక్టర్ సూచించారు. ప్రధాన రోడ్డు నుంచి వైద్య కళాశాల భవనం వరకు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేయాలని

మిగతా 8వ పేజీలో..



ఖుష్‌మహల్ వద్ద ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది



కోటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, సీపీ

ఖిలావరంగల్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఖిలావరంగల్ మధ్య కోటలోని ఖుష్‌మహల్ గ్రౌండ్ ముస్తాబుతోంది. మంగళవారం కలెక్టర్ ఆదేశాల మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు ఏర్పాట్లను చేపట్టారు. ఖుష్‌మహల్ గ్రౌండ్‌లో పెరిగిన ముళ్లపొదలను ఉదయం తొలగించారు. జెండా గద్దెతోపాటు, రాజకీయ నాయకులు, అధికారులు, కూర్చోవడానికి స్టేజీ, బారీకేడ్లు, టెంట్లు, తదితర పనులను చేపట్టారు. పోలీసుల పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాల కోసం గ్రౌండ్‌ను చదును చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పథకాలు, ప్రజలకు అందజేస్తున్న కార్యక్రమాలను తెలియజేసేందుకు అధికారులు పట్టు, చేనేత, విద్య, ఆరోగ్య, అటవి, పట్టు, అగ్నిమాపకశాఖ, వ్యవసాయశాఖల తదితర ప్రదర్శనల కోసం స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఖిలావరంగల్‌కు వచ్చే దారులకు ఇరువైపులా రోడ్లను మరమ్మతు చేసి, విద్యుత్‌దీపాలను సరిచేసి, చెత్తాచెదారాలను సంబంధిత శాఖల సిబ్బంది తొలగించి శుభ్రం చేస్తున్నారు. ఏర్పాట్లను పనులను పర్యవేక్షించేందుకు పోలీస్, రెవెన్యూ తదితర శాఖల అధికారులు పరిశీలించారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీపీ

ఖిలావరంగల్ మధ్య కోటలోని ఖుష్‌మహల్ వద్ద జరుగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను మంగళవారం రాత్రి కలెక్టర్ సత్యశారదా, నగర పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝాలు అధికారులతో కలిసి పరిశీలిం చారు. సభావేదిక వివిధ శాఖల అభివృద్ధి కార్యక్ర మాలపై చేసే ఏర్పాట్లను వారు పరిశీలించారు. అనంతరం కోటలో హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించా రు. జిల్లాలో జాతీయ పతాకం ఎగురవేయడానికి రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌరసంబం ధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్యఅతిథిగా హాజరుతారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాంనాయక్, ఖిలావరం గల్ తాహసీల్దా బండి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

జెండా ఎగురవేయనున్న మంత్రి 'పొంగులేటి'

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. ఖిలావరంగల్‌లోని ఖుష్‌మహాల్ మైదానంలో వేడుకల ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. గురువారం ఉదయం 9 గంటలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను అందజేయనున్నారు.

నాటు సారాపై ఉక్కుపాదం మోపండి..

- వరంగల్‌ను నాటు సారా రహిత జిల్లాగా మార్చండి
- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి

వరంగల్ క్రైం, ఆగస్టు 13: పల్లెల్ని, తండాలను పట్టిపీడిస్తున్న నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి సూచించారు. మంగళవారం హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎక్సైజ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో వరంగల్‌లోని 17 ఎక్సైజ్ స్టేషన్‌ల సీఐలు, ఎస్ఐలు ఐదు జిల్లాల సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు. నాటు సారా నిర్మూలకు తీసుకుంటున్న చర్యలు, నమోదైన కేసులు, మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న కార్యక్రమాలను కమలాసన్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటు సారాకు వినియోగించే బెల్లం సరఫరాపై నిఘా పెట్టాలని, సరఫరా చేస్తున్న వ్యక్తులపై పీడీయాక్ట్ పెట్టి కోర్టు మెట్లు ఎక్కించాలన్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి నిందితులకు కేసుల పడేలా చర్యలు చేపట్టాలన్నారు. నెలాఖరుకు వరంగల్‌ను నాటుసారా రహిత జిల్లాగా మార్చాలని ఆయన సూచించారు.

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ. ఎక్సైజ్ శాఖకు పూర్తి స్థాయిలో సహకరి స్తామని, నాటు సారా, గంజాయి ఇతర డ్రగ్స్ నిర్మూలను సమష్టిగా ముందుకు వెళతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వరంగల్‌ను డ్రగ్స్ ఫ్రీ జిల్లాగా మారుస్తామన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ అంజన్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్‌రావుతోపాటు ఐదు జిల్లాల ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చాలని సీఎం నిర్ణయం

డ్రగ్ రహిత రాష్ట్రంగా తెలంగాణను మార్చాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం విజయవంతానికి పోలీసులతో కలిసి ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళతామని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వి.బి.కమలాసన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈనెలాఖరు నాటికి డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. జూన్ 15 నుంచి స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోలీసులతో కలిసి జాయింట్ ఆపరేషన్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 75వేలకు పైగా కేసులు పెట్టినట్లు ఆయన తెలి పారు. నాటు సారాను పూర్తిస్థాయిలో నిర్మూలించ డంతోపాటు బెల్టుషాపులు నిర్వహించే వారిపై కేసులు పెడుతున్నట్లు కమలాసన్‌రెడ్డి వివరించారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ.. డ్రగ్స్ ఫ్రీ వరంగల్‌గా మార్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. డ్రగ్స్ వల్ల జరిగే నష్టంపై అవగాహన కలిగిం చేందు కు కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలు సైతం వేస్తున్నట్లు ఆయన తెలిపారు. తాము చేస్తున్న ప్రయత్నానికి మీడియా, తల్లిదండ్రులు సహకరించాలని అంబర్ కిషోర్ ఝా సూచించారు.



మాట్లాడుతున్న కమలాసన్‌రెడ్డి

భేష్ బిట్టు!

పోలీసు జాగిలానికి ఘనంగా ఉద్యోగ విరమణ

సేవలను కొనియాడిన సీపీ



వరంగల్ క్రైం, ఆగస్టు 13: 11 ఏళ్ల పాటు పోలీసు విభాగంలో సేవలందించిన బిట్టు (పోలీస్ జాగిలం)కు ఉద్యోగ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. మంగళవారం హనుమకొండలోని పోలీసు కమిషనరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో బిట్టును సీపీ అంబర్ కిషోర్ ఝూ ఘనంగా సత్కరించి చేసిన సేవలను కొనియాడారు. 2013 డిసెంబర్ 26న కమిషనరేట్ జాగిలాల విభాగంలో చేరి బిట్టు పోలీస్‌శాఖకు సేవలందించింది. ప్రధాన మంత్రులు, ముఖ్యమంత్రులతో పాటు ఇతర వీఐపీలు కమిషనరేట్ పరిధిలో పర్యటించినప్పుడు పేలుడు పదార్థాలు గుర్తించడంలో బిట్టు కీలకపాత్ర పోషించింది. బిట్టుకు హ్యాంగ్లర్‌గా కానిస్టేబుల్ ప్రభాకర్ వ్యవహరించాడు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీసుశాఖలో జాగిలం పాత్ర కీలకమన్నారు. పేలుడు పదార్థాలను గుర్తించడంతో పాటు మత్తు పదార్థాలు గుర్తించడంలోనూ జాగిలాలు ప్రధాన భూమిక పోషిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్‌ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, శ్రీధర్, చంద్రశేఖర్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు శోభన్‌కుమార్, డాగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టుకు అతిథిగా మంత్రి సురేఖ

హనుమకొండ కలెక్టరేట్, ఆగస్టు 13: హనుమకొండలోని పోలీస్ పరేడ్‌గ్రౌండులో నిర్వహించే స్వాతంత్ర్య వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. అనంతరం పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రతిభ కనబర్చిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలను మంత్రి చేతులమీదుగా అందజేస్తారు.

కోల్ రైల్‌కు సై!

ఓరుగల్లుకు రానున్న మూడు కొత్త రైల్వే మార్గాలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

కోల్‌రైల్‌కు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. 1998 నుంచి భూపాలపల్లి కోల్‌బెల్ట్‌కు రైల్వే లైన్ నిర్మాణం చేయాలనే డిమాండ్ ఉంది. ఎట్టకేలకు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినివైష్ణవ్ కోల్‌రైల్‌పై ప్రకటన చేశారు. పెద్దపల్లి జిల్లా రామగుండం నుంచి భూపాలపల్లి, రామప్ప, మేడారం మీదుగా మణుగూరు వరకు 207కిలోమీటర్ల రైల్వే లైన్ నిర్మిస్తున్నట్లుగా పేర్కొన్నారు. దీనికోసం డీపీఆర్‌లు సిద్ధం చేశారు. అటవీ శాఖ నుంచి పూర్తి స్థాయిలో అనుమతులు లేకపోవటం కొంత జాప్యం జరుగుతోంది. అయితే రెండు మూడు నెలల్లో తుది అనుమతులు మంజూరు కానున్నాయని రైల్వే అధికారులు పేర్కొంటున్నారు.

రామగుండం నుంచి మణుగూరు వరకు 207కి.మీ.ల రైల్వేలైన్ కోసం సుమారు రూ.4,100 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2013-14లో రామగుండం - మణుగూరు రైల్వేలైన్ నిర్మాణం కోసం సర్వే చేయగా, 207కిలోమీటర్ల రైల్వేలైన్‌కు రూ.1,112కోట్లతో ఈ రైల్వే లైన్ నిర్మించవచ్చునని ప్రతిపాదన చేశారు. పదేళ్లలో ఈ అంచనా వ్యయం నాలుగు రేట్లు పెరిగింది. ఇక ఈ లైన్ పూర్తి అయితే భూపాలపల్లికి రైల్ కనెక్టివిటీ ఏర్పడుతుంది. దీంతో బొగ్గు దిగుమతి, ఎగుమతికి కష్టాలు తప్పనున్నాయి. అలాగే రామగుడం నుంచి భూ పాలపల్లి మీదుగా మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణంతో థర్మల్ పవర్ ప్రాజెక్టులకు బొగ్గు సరఫరా సులభం కానుంది. ప్రస్తుతం భూపాల పల్లిలోని కేటీపీపీకి బొగ్గును రామగుండం నుం చి రైల్ ద్వారా హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వేస్టేషన్‌కు దిగుమతి చేసుకుంటున్నారు. ఉప్పల్ నుంచి 70కిలో మీటర్లు ప్రయాణించిన పరకాల మీదుగా కేటీపీపీకి బొగ్గును సరఫరా చేస్తున్నారు. దీంతో అధిక వ్యయంతో పాటు సమయానికి బొగ్గు కేటీపీపీకి చేరటం లేదు.

అలాగే ఈ రైల్వేలైన్ ఏరియాలోనే రామగుండం సమీపంలోని 2,600 మెగావాట్ల ఎన్‌టీపీసీ విద్యుత్ కేంద్రంతో పాటు 1,600 మెగావాట్ల తెలంగాణ ఎన్‌టీపీసీ ప్రాజెక్టు, అలాగే జైపూర్‌లోని జెన్‌కోకు చెందిన 6,200మెగావాట్లు, 11 మెగావాట్లు విద్యుత్ కేంద్రాలు భూపాలపల్లిలో ఉన్నాయి. మణుగూరు సమీపంలోని 1,200 మెగావాట్ల భద్రాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టుకు కూడా రైల్‌మార్గం అందుబాటులో లేదు. ఈ లైన్‌తో బొగ్గు సరఫరా ఈ పరిశ్రమలకు సులభతరం కానుంది. అలాగే కొత్త రైల్వేలైన్‌తో పర్యాటక రంగానికి పండుగ కానుంది. రామగుడం నుంచి మణుగూరు వరకు అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయి. వీటన్నింటినీ లింకు చేసుకుంటూ లైన్ నిర్మాణం చేయనున్నారు. ప్రధానంగా మంథని, కాళేశ్వరం, రామప్ప, మేడారం, లక్నవరం, ఏటూరునాగారం అభయారణ్యం, బొగత, మల్లూరు తదితర పుణ్యక్షేత్రాలు, పర్యాటక కేంద్రాలకు సమీపం నుంచి మణుగూరు వరకు రైల్వేలైన్ నిర్మాణం సాగనుంది. దీంతో ఈ రైల్వేలైన్‌తో పర్యాటకానికి కొత్త కళ రానుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

డోర్నకల్ టు మిర్యాలగూడ, గద్వాల

రైల్వేశాఖ ప్రకటించిన కొత్త ప్రాజెక్టుల్లో కీలకమైనది మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ జంక్షన్ నుంచి నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వరకు 105కి.మీ రైల్వే లైన్. ఈ ప్రాజెక్టు కోసం రైల్వేశాఖ రూ.2,100కోట్ల అంచనాలతో డీపీఆర్ తయారు చేశారు. డోర్నకల్ నుంచి మహబూబాబాద్, ఖమ్మం జిల్లా ముదిగొండ, రాజేశ్వరపురం, నేలకొండపల్లి, కోదాడ మీదుగా మిర్యాలగూడ చేరుతుంది. ఈ లైన్‌తో హైదరాబాద్, విజయవాడ, చెన్నై, న్యూఢిల్లీకి అనుసంధానమవుతుంది. దీంతో యాదాద్రి పవర్ ప్లాంట్ వరకు భూపాలపల్లి నుంచి బొగ్గును, మహబూబాబాద్, సూర్యాపేట, ఖమ్మం నుంచి ధాన్యం, బియ్యం, గ్రానైట్ పరిశ్రమలకు, సిమెంట్ పరిశ్రమలకు సరుకులను రవాణా, షుగర్ ఫ్యాక్టరీల నుంచి చెక్కర సరఫరా చేసేందుకు మార్గం సుగమమవుతుంది.

అలాగే డోర్నకల్ నుంచి గద్వాల వరకు 296కిలో మీటర్ల రైల్వేలైన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ లైన్ కోసం రూ.5వేల కోట్లతో అంచనాలను రూపొందించింది. ఈ లైన్‌తో వరంగల్ మీదుగా హైదరాబాద్, విజయవాడ సాగే లైన్‌తో మహబూబ్‌నగర్ మీదుగా హైదరాబాద్, బెంగూళూరు లైన్‌ను అనుసంధానం చేస్తున్నారు. కీలకమైన రెండు మార్గాలను అనుసంధానంతో పాటు కొత్తగా రైల్వేలైన్ లేని ప్రాంతాలకు కూడా రైల్వే కనెక్టివిటీ జరుగుతుంది. ఉత్తర, దక్షిణ ప్రాంతాలను కలిపే ఈ లైన్‌తో డోర్నకల్ జంక్షన్ మరింత కీలకంగా మారనుంది. వీటితో పాటు పశ్చిమబెంగాల్‌లోని అసన్‌సోల్ నుంచి వరంగల్ వరకు 1,316కిలో మీటర్ల రైల్వే కనెక్టివిటీకి కేంద్ర రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. ఈప్రాజెక్టుకు సుమారు రూ.7,382కోట్లు ఖర్చు చేస్తుంది. భద్రాచలం వద్ద నిర్మించే కొత్త స్టేషన్‌తో వరంగల్ రైల్వేలైన్‌కు అనుసంధానం అవుతుంది. గిరిజనుల అధికంగా ఉండే ప్రాంతాల గుండా ఈ రైల్వేలైన్ ఏర్పాటు చేయనున్నారు. ప్రధానంగా బొగ్గు సరఫరాతో పాటు ప్రకృతి వైపరిత్యాల సందర్భాల్లో ప్రత్యామ్నాయం లైన్‌గా ఇది పని చేస్తుందని రైల్వేశాఖ భావిస్తోంది. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఆరు ప్రాజెక్టుల్లో నాలుగు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు ప్రయోజనం చేకూర్చేవే కావటం విశేషం.

అటకెక్కిన కాజీపేట - భూపాలపల్లి లైన్

కాజీపేట-భూపాలపల్లి మధ్య రైల్వేలైన్‌కు 2023-24 బడ్జెట్‌లో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఫైనల్ లోకేషన్ సర్వే (ఎఫ్ఎల్ఎస్) కోసం రైల్వే శాఖ రూ.1,152కోట్ల నిధులు మంజూరు చేసింది. కాజీపేట నుంచి హసన్‌పర్తి లైన్ మీదుగా కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ నుంచి రెండు కిలో మీరట్ల దూరంలోని మర్రిపల్లి గ్రామం వద్ద సైడ్ ట్రాక్ ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేశారు. మర్రిపల్లి ట్రాక్ నుంచి చిట్యాల మండలం జడలపేట మీదుగా భూపాలపల్లి వరకు ఈ లైన్ నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. అయితే 2023-24లో నిధులు కేటాయించినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. దీంతో 2024-25 బడ్జెట్‌లో కాజీపేట- భూపాలపల్లి రైల్వేలైన్‌కు గ్రీన్‌సిగ్నల్ రాలేదనే విమర్శలున్నాయి. వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య కాజీపేట-భూపాలపల్లి లైన్‌పై దృష్టి పెట్టి రైల్వేశాఖపై ఒత్తిడి తీసుకురావాలని ఓరుగల్లువాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊసేలేని రైల్వే డివిజన్

కాజీపేట మీదుగా సెంట్రల్ ఇండియా, నార్త్ ఇండియాకు రైళ్లు నడుస్తున్నాయి. కాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్ మీదుగా ప్రతీరోజు సుమారు 200కు పైగా గూడ్స్, ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడుస్తున్నాయి. వీటితో పాటు భూపాలపల్లి, రామగుండం, గోదావరిఖని, మణుగూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో ఉన్న బొగ్గు రవాణా కాజీపేట రైల్వే స్టేషన్ మీదుగానే జరుగుతుంది. ఎక్కువ అదాయం వచ్చే జంక్షన్‌లల్లో కాజీపేట ప్రథమ స్థానంలో నిలుస్తుంది. హైదరాబాద్-సికింద్రాబాద్‌కు 128కిలో మీటర్లకు పైగా ఉన్న కాజీపేటను డివిజన్‌గా చేయటంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలు ఉన్నాయి.

నేత కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

మడికొండ, ఆగస్టు 13: కాంగ్రెస్ ప్రభుత్వం నేత కార్మికులకు అండగా ఉండి ఆదుకుంటోందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం మడికొండలోని టెక్స్‌టైల్ పార్కులో సిడీబీ క్లస్టర్ ఇంటర్వెన్షన్ ప్రోగ్రామ్ ఏజీఎం స్మృతివాజ్‌పేయి ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన లాంచ్ వర్క్‌షాప్ కమ్ ఆడాప్షన్ ఆఫ్ గ్రీన్ టెక్నాలజీ సెమినార్‌లో వరంగల్ ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పొట్టచేతపట్టుకొని సూరత్, షోలాపూర్ వంటి ప్రాంతాలకు వలస వెళ్లి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సొంత రాష్ట్రంలో తమ తల రాతలు మారతాయని నమ్మి వచ్చిన నేత కార్మికులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని, నేత కార్మికులకు సైతం తగిన న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. తన శక్తి మేరకు నేత కార్మికులకు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్లమెంట్‌లో మాట్లాడి జిల్లాకు వెల్‌నెస్ సెంటర్ తీసుకువచ్చానని తెలిపారు.

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు మాట్లాడుతూ.. టెక్స్‌టైల్ పార్కులో యూనిట్లు సక్రమంగా నడుస్తున్నాయని భావించానని, క్షేత్రస్థాయిలో నేత కార్మికుల పరిస్థితి వేరే విధంగా ఉందన్నారు. గత ప్రభుత్వం నేత కార్మికులను నిర్లక్ష్యం చేసిందన్నారు. నేతకార్మికులు తనతో సమావేశమై తమ సమస్యలు పూర్తిగా తెలిపినట్లయితే వారిని మంత్రి కొండా సురేఖ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్దకు తీసుకెళ్లి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాకతీయ టెక్స్‌టైల్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ పొదుపు, పరస్పర సహాయక సహకారం సంఘం అధ్యక్షుడు ఊరుకొండ శ్రీరాములు మాట్లాడుతూ.. కాంగ్రెస్ హయాంలోనే ప్రారంభించిన టెక్స్‌టైల్ పార్కులో 164 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి ప్రారంభించాయని, వాటికే లోన్లు వచ్చాయని, మిగతా 200యూనిట్లకు లోన్‌లు మంజూరు కాకపోవడంతో ఖాయిలా పడ్డాయన్నారు. వాటికి ప్రభుత్వం సబ్సిడీగానీ, విద్యుత్ సబ్సిడీ గానీ రానందున యూనిట్లు ఉత్పత్తి చేయడంలేదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందించే స్కూల్ యూనిఫామ్‌లు, సింగరేణి వంటి సంస్థలకు ఇచ్చే యూనిఫామ్‌లకు చెందిన వస్త్రాలను నేసే పనిని తమకు ఇప్పించినట్లయితే నేత కార్మికులను ఆదుకున్నట్లవుతుందని తెలిపారు. ఈ మేరకు ఎంపీ, ఎమ్మెల్యే చొరవచూపి తమకు తగిన న్యాయం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కడియం కావ్య

ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు దర్గా స్వామి, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కోశాధికారి ఆముదాల జ్యోతిభాస్కర్, డైరెక్టర్లు సదానందం, రాధిక తిరుపతి నేత కార్మికులు, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు వస్కుల శంకర్, బిల్ల రవిందర్, వస్కుల నాగరాజు, కుర్ల మోహన్, కొప్పుల నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఇంటర్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలి

ఉత్తర్వులు జారీ చేసిన ఇంటర్ విద్య డైరెక్టర్ శృతి ఓఝా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించిన ఇంటర్మీడియెట్ ఆర్జేడీ కార్యాలయాన్ని వెంటనే వరంగల్‌లో తిరిగి ప్రారంభించాలని ఇంటర్మీడియెట్ విద్యాశాఖ డైరెక్టర్ శృతి ఓఝా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కార్యాలయ భవనం సమకూరే వరకు ప్రస్తుతానికి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేయాలని ఆమె ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరంగల్ నుంచి ఆర్జేడీ కార్యాలయం తరలింపునకు ముందు పనిచేసిన ఆర్జేడీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌తో పాటు అందరూ సిబ్బంది తిరిగి ఆర్జేడీ కార్యాలయంలో విధుల్లో చేరాల్సిందిగా ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆర్జేడీ కార్యాలయం తిరిగి వరంగల్‌లో ఏర్పాటు కానుండటంతో వివిధ అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ బృంద గీతాల పోటీలు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో గ్రేటర్ వరంగల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు ఈనెల 31న జాతీయ బృందగీతాల పోటీలను నిర్వహిస్తున్నట్లు పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సుధీర్‌కుమార్, కె.సత్యనారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలసముద్రంలోని సామా జగన్మోహన్ స్మారక భవనంలో 6 నుంచి 10 తరగతులు చదివే విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఒక్కో పాఠశాల నుంచి 6 నుంచి 8 మంది విద్యార్థులు పాల్గొనే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 22లోగా పోటీల కన్వీనర్ కమలమనోహర్ (9440604347)కు వివరాలను పంపించాల్సిందిగా వారు కోరారు.

ఎన్ఐఆర్ఎఫ్‌లో నిట్‌కు 21వ ర్యాంకు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్(ఎన్ఐఆర్ఎఫ్) నిట్‌కు ఇంజనీరింగ్ కేటగిరిలో 21వ ర్యాంకు దక్కింది. సోమవారం సాయంత్రం కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో నిట్‌కు ఓవరాల్ కేటగిరిలో 53వ ర్యాంకు సాధించింది. మేనేజ్‌మెంట్ విభాగంలో 100వ ర్యాంకును పొందింది. ఈ సందర్భంగా నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ.. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకులను క్షుణ్ణంగా విశ్లేషిస్తామని, మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY 8
వరంగల్ సిటీ
● వరంగల్ ● ఖిలావరంగల్
బుధవారం 14 ఆగస్టు 2024

జీవశాస్త్ర ఉపాధ్యాయులకు శిక్షణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: ఇటీవల స్కూల్ అసిస్టెంట్ బయాలజీగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కాకతీయ విశ్వవిద్యాలయం జంతుశాస్త్ర విభాగం సెమినార్ హాలులో నిర్వహించగా డీఈవో వాసంతి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర బోధనలో భాగంగా చేయాలిన పలు రకాల ప్రయోగ కృత్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, బయాలజీ సబ్జెక్టు ఫోరం విషయ నిపుణులు కిరణ్, కృష్ణ, రమేశ్, రాజు, ధనలక్ష్మి, పరమేశ్వర్, సుమలత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈవో వాసంతి


సమావేశంలో మాట్లాడుతున్న సంజు

40 అడుగుల మట్టి గణపతి ఏర్పాటు

మట్టెవాడ, ఆగస్టు 13: వరంగల్‌లో మొదటిసారిగా 40 అడుగుల మట్టి గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు భద్రకాళి హిందూ ఉత్సవ కమిటీ వ్యవస్థాపకుడు ఆకుతోట సంజు తెలిపారు. మంగళవారం ఎల్లంబజారులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 40అడుగుల మట్టి గణపతిని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ ఖైరతాబాద్ తర్వాత వరంగల్‌లో ప్రతిష్ఠిస్తున్నట్లు పేర్కొన్నారు. ఒరిస్సా శిల్పి జయదేవ్‌తోపాటు 10మంది శిల్పులు నెల రోజులపాటుగా తయారు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు రూ.20లక్షల వ్యయంతో విగ్రహం రూపుదిద్దుకోబోతోందన్నారు. సమావేశంలో భద్రకాళి శేషు, సుమన్‌శర్మ, మడిపల్లి కృష్ణ, పిట్ట నరసింగా రావు, అయ్యప్ప శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సంఘాల పెత్తనం



అసంతృప్తి వ్యక్తం చేస్తున్న భక్తులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 13: నగరంలోని పెద్ద ఆలయాల్లో అభివృద్ధి కమిటీల పేరుతో కార్పొరేన్లు, పరపతి సంఘాల నాయకుల పెత్తనం పెరిగిపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని దేవాలయాల్లో ప్రధానార్చకులదే ఇష్టారాజ్యంగా కొనసాగుతోందని వాపోతున్నారు. సెంటిమెంట్‌తో గుడిలో కార్పొరేషన్ అని, వచ్చిన లాభం దేవుని ఉత్సవాలకు సగం ఇస్తామని చెబుతూ పెద్దలు వ్యాపారం నడిపిస్తున్నారని పేర్కొన్నారు. పరపతి సంఘంతో ఏర్పాటై నాలుగు, ఐదు గ్రూపుల సంఘాలు కొనసాగిస్తున్నారు. ఒక్కో గ్రూప్‌లో దాదాపు వంద మంది ఉంటున్నారు. తద్వారా లక్షల రూపాయల వ్యాపార లావాదేవీలు కోట్ల రూపాయలకు చేరి కొనసాగుతున్నాయి. దీనితో కొన్ని ఆలయాలకు దేవాదాయ శాఖ సిబ్బంది ఎవరు రాకుండా పరపతి సంఘాల నాయకులు శాషిస్తున్నారు. పండుగలు, పర్వదినాలు, ఉత్సవాలు నిర్వహణ సమయంలో కార్యక్రమ నిర్వహణలో వీరే ముందుంటున్నారనే ప్రచారం సాగుతోంది. నగరంలో 25కు పైగా ప్రధాన దేవాలయాలున్నాయి. దాదాపు అన్ని ఆలయాల్లో పరపతి సంఘాలు, కార్పొరేషన్లు కొనసాగుతున్నాయి. వీటి నిర్వహణ ద్వారా వచ్చిన లాభాలు ఆలయానికి దేవుడికే అని చెప్పినా దానికి సంబంధించిన వివరాలు, పత్రాలు ఏవీ కూడా ఆలయాల్లో కనిపించడం లేదని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. లక్షల రూపాయలు విరాళం ఇచ్చిన దాతల వారిపేర్లు కూడా కనిపించడం లేదని పేర్కొంటున్నారు.

అమ్మవారి సన్నిధిలో ..

వరంగల్ కల్చరల్, ఆగస్టు 13: భద్రకాళి అమ్మవారిని జనగామ జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్ అపూర్వ దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆ దంపతులు గణపతిని దర్శించుకొని అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ ఈవో శేషు భారతి అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేశారు.


పూజలు చేస్తున్న జనగామ అడిషనల్ కలెక్టర్ దంపతులు


సతీష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న నరేందర్

దుర్గేశ్వరాలయ మాజీ చైర్మన్ సతీష్ మృతి

గిర్మాజీపేట, ఆగస్టు 13 : బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, దుర్గేశ్వరాలయం మాజీ చైర్మన్, వరంగల్ పట్టణ నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఎలకంటి సతీష్ (52) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. గిర్మాజీపేట బొడ్రాయి సమీపంలోని డాక్టర్ నరసింహారావు ఆస్పత్రి పక్కనే అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సతీష్‌కు సోమవారం చాతిలో నొప్పి రావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మంగళవారం ఉదయం మృతి సమాచారం తెలియటంతోనే మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల్లో మాజీ ఎమ్మెల్యే నరేందర్, కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి, మాజీ కార్పొరేటర్ కుందారపు రాజేందర్ పాల్గొన్నారు. మృతుడికి భార్య ఉమాదేవి, కుమారుడు, కూతురు ఉన్నారు.

» మట్టెవాడ: చారుబౌళి నిజాంపురకు చెందిన ఇబ్రహీం మంగళవారం మృతి చెందగా, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మంగళవారం రాత్రి మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కళాశాలను సందర్శించిన డీఐఈవో

ఖిలావరంగల్, ఆగస్టు 13: మధ్యకోటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈవో శ్రీధర్‌సుమన్ మంగళవారం సందర్శించారు. ఇటీవల వరంగల్ డీఐఈవోగా పదవీ బాధ్యతలు చేపట్టిన సుమన్ ఖిలావరంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధి కార్యక్రమాలపై కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సత్యనారాయణ అధ్యక్షతన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.సురేందర్ రెడ్డి, జి.రాములు, సీహెచ్ రాజు, కె.ప్రసాద్, వి.రజిత పాల్గొన్నారు.

భారీ హనుమాన్ విగ్రహం నిర్మాణం

ఖిలావరంగల్, ఆగస్టు 13: అండర్ రైల్వేగేట్‌లోని ఖిలావరంగల్ ఖమ్మంరోడ్ ప్రాంతం ఆధ్యాత్మికత సంతరించుకుంది. శ్రీశివశక్తి వినాయక మందిరం, 18.1అడుగుల భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 20ఏళ్ల క్రితం జరిగిన రోడ్డు వెడల్పు తవ్వకాల్లో విఘ్నేశ్వరుడు, శివలింగం, నంది విగ్రహాలు బయటపడగా, వరంగల్‌కు చెందిన పెద్దోజు వజ్రమ్మ అనే వృద్ధురాలు వాటిని సమీపంలో(పెట్రోల్‌పంపు) వద్ద ఇటుకలతో చిన్న గుడిని ఏర్పాటు నిత్య పూజలు చేస్తోంది. దానిని గుర్తించిన భక్తుడు చెన్నూరి దేవేందర్ స్థానికులతో కలిసి శ్రీ శివశక్తి, వినాయకమందిరం పేరుతో కమిటీని ఏర్పాటు చేశారు. దాతల సాయంతో ఆరునెలల క్రితం ఖిలావరంగల్ -ఖమ్మంరోడ్‌వద్ద శ్రీ శివశక్తి, వినాయక మందిర నిర్మాణాన్ని ప్రారంభించారు. ఏడాది క్రితం బొడ్రాయిని కూడా ప్రతిష్ఠించారు. నెల రోజుల క్రితం రుద్రమాంబనగర్, పెట్రోల్‌బంక్, విద్యానగర్, శివనగర్, తదితర ప్రజాప్రతినిధులు, స్థానికుల సాయంతో ఖిలావరంగల్-ఖమ్మంరోడ్ వై-జంక్షన్ సమీపంలో 18.1 అడుగుల హనుమాన్ విగ్రహాన్ని నిర్మిస్తున్నారు. పెరకవాడలో చంద్రమౌళీశ్వరస్వామి దేవాలయం, శివనగర్ మెట్లబావి వద్ద ధనమైసమ్మ దేవాలయం, పద్మశాలి కల్యాణ భవనం వద్ద భక్తమార్కండేయ దేవాలయం, ఖిలా పెట్రోల్‌పంపు వద్ద శ్రీ శివశక్తి-వినాయకమందిరంతోపాటు 26నుంచి 28 వరకు శ్రీ శివశక్తి,వినాయక దేవాలయంలో విగ్రహాల ఏర్పాటుతోపాటు శ్రీహ నుమాన్ విగ్రహం ఏర్పాటు చేయనున్నారు.


కొనసాగుతున్న హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులు

ఇంజనీరింగ్ విభాగంలో అంతర్గత బదిలీలు

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని ఇంజనీరింగ్ విభాగంలో ఎట్టకేలకు బదిలీలు జరిగాయి. డీఈల విభాగంలో రాజ్‌కుమార్, సారంగం, రవికిరణ్, శివానంద్‌లు ఉన్నారు. మరో ఇద్దరు డీఈలుకు స్థానచలనం కల్పించకుండా కీలక బాధ్యతల్లో ఉంచినట్టు తెలుస్తోంది. అయితే ఇటీవల కరీంనగర్ నుంచి జిల్లాకు వచ్చిన మహేందర్‌కు ఎలక్ట్రికల్, సాలిడ్ వెస్ట్ సెక్షన్లు అప్పగించారు. ఇంకా 16 మంది ఏఈలు, ఇద్దరు డీఎంలను కలుపుకుని 18 మంది డివిజన్‌లతోపాటు పలు శాఖలలో పని చేస్తారు. వీరిలో పది మందికి మాత్రమే బదిలీ చేస్తూ పలు శాఖలు కేటాయించగా, మరో ఆరుగురిని బదిలీ చేయకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇద్దరు పురుష ఏఈలతోపాటు ఓ మహిళా ఏఈ శాఖలో రిక్రూట్‌మెంట్ జరిగిన ఏడేళ్లుగా ఒకేచోట పని చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఈ బదిలీలు పూర్తిగా అడ్డదారిలో జరిగాయని ఉన్నతాధికారులు మరోమారు పునరాలోచించి అందరికీ స్థానచలనం కల్పించాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు.

బదిలీల్లో అక్రమాలు?

ఇంజనీరింగ్ శాఖలో జరిగిన బదిలీలలో పైరవీలు జోరుగా సాగినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మూడేళ్లకు మించి ఒకే చోట పనిచేసిన వారిని గుర్తించి సీనియారిటీ ఆధారంగా బదిలీలు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, నిబంధనలు ఉల్లంఘించి ఈ బదిలీలు జరిగినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరికి మాత్రమే బదిలీలు నిర్వహించడంపై మిగతా సిబ్బంది మండిపడుతున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్న వారికి బదిలీలు జరగలేదని అంటున్నారు.

కార్ల దొంగల ముఠా అరెస్టు

మట్టెవాడ, ఆగస్టు 13: ఫైనాన్షియల్ ముసుగులో కార్లు, జేసీబీలు ఇతర భారీ వాహనాలు కొనుగోలు పేరుతో మోసాలకు పాల్పడుతున్న రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన దశరథ్ ముఠా సభ్యులను మంగళవారం అరెస్టు చేసినట్లు వరంగల్ మట్టెవాడ సీఐ తుమ్మ గోపి తెలిపారు. సీఐ కథనం ప్రకారం... వరంగల్ డాక్టర్స్‌కాలనీకి చెందిన సంపెల్లి శ్రీనివాసరావు ఎక్స్‌కవేటర్ వాహనాన్ని 2023లో రంగారెడ్డి జిల్లాకు చెందిన వరికొప్పుల దశరథ్ కొనుగోలు చేశారు. దశరథ్, దుర్గం సనదన్ బొమ్మ సురేశ్‌గౌడ్ వీరికి ఫైనాన్స్ ఇచ్చే అఖిల్ కలిసి సెకండ్ హ్యాండ్ వాహనాలను వాహన యజమానుల నుంచి తక్కువ ధరలకు కొనుగోలు చేసి వాహనాలపై ఉన్న ఫైనాన్స్ ఉంటే తామే కట్టుకుంటామని మాయమాటలు చెప్పి అగ్రిమెంట్ పత్రాలు రాసి ఇచ్చేవాడు. ఆ వాహనాలు తీసుకొని వెళ్లి స్ర్కాప్ షాపులలో, వేరే రాష్ట్రానికి తరలించి అమ్ముకొని డబ్బులను పంచుకొని వాహన యజమానులకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారు. అలాగే శ్రీనివాసరావు వాహనాన్ని కూడా 24 లక్షలకు కొనుగోలు చేసి 3లక్షలు ఇచ్చి మిగతా డబ్బులు ఇవ్వకుండా ఈఎంఐలు కట్టకుండా తప్పించుకొని తిరుగుతుండగా జూన్‌లో వరికొప్పుల దశరథ్, దుర్గం సనదన్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు. మంగళవారం కేసులో నిందితులుగా ఉండి తప్పించుకొని తిరుగుతున్న బొమ్మ సురేశ్‌గౌడ్, ఫైనాన్స్ ఇచ్చే అఖిల్‌లను అరెస్టు చేసి వారి నుంచి రూ. 8 లక్షల నగదును స్వాధీనపర్చుకున్నట్లు సీఐ తెలిపారు.

భార్యను హతమార్చిన భర్త

శంభునిపేట, ఆగస్టు 13 : మానసిక స్థితి కోల్పోయి కట్టుకున్న భార్యనే కడతేర్చిన ఘటన వర్ధన్నపేట మండలం చెన్నారంలోమంగళవారం చోటుచేసుకుంది. మామునూరు సీఐ రవి కిరణ్ కథనం ప్రకారం... చెన్నారం గ్రామం కాషాయగూడెంకు చెందిన ఎస్కే హైదర్ కొంత కాలంగా మానసిక స్థితిని కోల్పోయాడు. కొద్దిరోజులుగా ఎవరు కనిపించినా చంపుతానంటూ బెదిస్తున్నాడు. మంగళవారం భార్య నూరుబీ (50)తో గొడవ పడి ఆవేశాన్ని తట్టుకోలేక ఇంట్లోనే టవల్‌తో గొంతు నులిమాడు. శ్వాస ఆడక నూరుబీ ఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించారు.

రైలు కిందపడి ఆత్మహత్య


ఎల్లయ్య (ఫైల్)

గిర్మాజీపేట, ఆగస్టు 13 : వరంగల్-చింతల్‌పల్లి రైల్వే స్టేషన్ల మధ్య ధర్మారం రైల్వేగేటు సమీపంలో మంగళవారం మధ్యాహ్నం రైలు కిందపడి పోడేటి ఎల్లయ్య(52) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. సంగెంకు చెందిన ఎల్లయ్య కూలీ పనిచేసుకుంటూ భార్య పూలమ్మ, కుమారుడు రక్షిత్, కుమార్తె మేఘనలతో జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న ఎల్లయ్య జీవితంపై విరక్తి చెంది డౌన్‌లైన్‌లో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఎంజీఎం మార్చురీలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని భార్య, కుమారుడికి అప్పగించి వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వాహనదారులకు జరిమానా

మట్టెవాడ, ఆగస్టు 13: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 36 మంది వాహనదారులకు మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 36 మంది వాహనదారులకు రూ. 54300 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన ముగ్గురు వాహనదారులకు రూ. 3000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

శంభునిపేట, ఆగస్టు 13 : ఆంధ్రప్రదేశ్ నుంచి వరంగల్‌కు గంజాయిని సరఫరా చేస్తున్న వ్యక్తిని మామునూరు పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మామునూరు సీఐ రవికుమార్ కథనం ప్రకారం. ఎస్ఐ శ్రీకాంత్ సింగారం క్రాస్ రోడ్ వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఆటోలో వెళ్తున్న వ్యక్తి పోలీసులను చూసి పారిపోవటానికి యత్నించాడు. దాంతో అతడిని పట్టుకుని విచారించగా రెండు సంచుల్లో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా బొబ్బిలి మండలం అప్పల వలస గ్రామానికి చెందిన గేదెల శ్రీరామ్ విజయనగరం నుంచి గంజాయిని తీసుకువచ్చి బొల్లికుంట వాగ్దేవి కళాశాల వద్ద విక్రయించడానికి ప్రయత్నించాడు. ఆటోలో గంజాయిని తరలిస్తుండగా, నిందితుడిని అరెస్టు చేసి, సుమారు రూ.4,45,875 విలువైన 17.835 కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న ఎస్ఐ శ్రీకాంత్‌తో పాటు కానిస్టేబుల్స్ డి.సంపత్, కె.శ్రీనివాస్, హోంగార్డ్స్ ఎ.నవీన్, వి.దుర్గయ్యలను సీఐ అభినందించారు.

మృతుడి కుటుంబానికి సాయం

సంగెం, ఆగస్టు13: కాట్రపల్లిలో ఇటీవల మృతిచెందిన మేకల సత్యం ముదిరాజ్ కుటుంబానికి మెపా(తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అండగా నిలిచి నిత్యావసర వస్తువులను అందించింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పి.దేవేందర్ పరామర్శించారు. కార్యక్రమంలో నీరటి రాజు, రావుల రాణాప్రతాప్, రావుల ఎల్లయ్య, కేశబోయిన యాదగిరి, చెక్క సాంబమూర్తి పాల్గొన్నారు.


జాతీయ జెండాలతో బీజేపీ మహిళా మోర్చా నాయకులు

సమైక్యత కోసమే హర్ ఘర్ తిరంగ

మిల్స్‌కాలనీ, ఆగస్టు 13: ప్రజల్లో సమగ్రత, సమైక్యతను పెంపొందించేందుకే బీజేపీ హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమం చేపట్టిందని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కాసు శిల్ప అన్నారు. హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి పోచమ్మమైదాన్ సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ మాట్లాడుతూ... స్వాతంత్ర్య దినోత్సవం నాడు ప్రతీ ఒక్కరు వారి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, కార్పొరేటర్ కల్పన, జిల్లా ప్రధానకార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు రంజిత్, భరత్‌వీర్, మార్టిన్ లూథర్, వెంకటేష్, శ్యాం, సుజాత పాల్గొన్నారు.

హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న భోగేశ్వర్

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 13: రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో పని చేసేందుకు పది వేల పీఎస్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ డిమాండ్ చేశారు. సభ్యత్వాల నమోదులో భాగంగా మంగళవారం వరంగల్ మండలంలోని పలు పాఠశాలల్లో నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మట్టెవాడ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎస్టీజీ ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును కల్పించాలన్నారు. డీఈడీతోపాటు బీఈడీ అర్హత కలిగిన ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అన్ని బిల్లులను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, మనోజ్, స్వామి, అశోక్, వెంకట్, రమేష్, ఉమేష్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మక్కలు క్వింటా రూ.2,765

వరంగల్ వ్యవసాయం: ఆగస్టు 13: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మక్కలకు మంచి ధర పలికింది. మద్దతు ధర క్వింటా రూ.2,090 కాగా మంగళవారం తోట దేవరాజ్ అనే రైతు తీసుకొచ్చిన 257 బస్తాలకు క్వింటాకు రూ.2,765 ధర పలికింది. వాయుదాత అడ్తిద్వారా సురేష్ ఎంటర్ ప్రైజెస్ కొనుగోలు చేసింది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే అధిక ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఆస్పత్రి భవన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి

5వ పేజీ తరువాయి

మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్య కళాశాలకు సంబంధించిన 500సీట్ల భర్తీకి అడ్మిషన్లు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి వైద్య కళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు తదితర సౌకర్యాలతోపాటు హాస్టల్ వసతి భవననిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, కిషన్‌నాయక్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షక అధికారి డాక్టర్ గోపాల్, ఈఈ ప్రసాద్, డాక్టర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముగిసిన దిలీప్, అంజలి అంత్యక్రియలు

పోచమ్మమైదాన్, ఆగస్టు 13: రాయపర్తి మండల కేంద్రం శివారులోని రాంచంద్రుని చెరువులో మృతి చెందిన పైడిపెల్లికి చెందిన సంగాల దిలీప్ (29), తిక్క అంజలి (25) మృతదేహాలకు మంగళవారం కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఎంజీఎం మార్చురీలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కార్పొరేటర్ జన్ను షిభారాణి అనిల్ మృతదేహాలకు నివాళులర్పించారు. అనంతరం మృతదేహాలను నేరుగా పైడిపెల్లిలోని శ్మశాన వాటికకు తరలించారు. తొలుత యువతి అంత్యక్రియలు పూర్తయ్యాక, బంధువులంతా వెళ్లిపోయాక అదే శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇరు కుటుంబాలు, బంధువుల మధ్య ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఉద్రిక్త నడుమ అంత్యక్రియలు జరిగాయి.

బస్, రైల్వే స్టేషన్లలో తనిఖీలు



వరంగల్ చౌరస్తా, ఆగస్టు 13: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఇంతేజార్‌గంజ్ పోలీసుస్టేషన్ పరిధిలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా డాగ్ స్క్వాడ్, బీడీ టీంతో తనిఖీలు నిర్వహించినట్లు సీఐ మచ్చ శివకుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి వరంగల్ బస్టాండ్, వరంగల్ రైల్వే స్టేషన్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ శివకుమార్ మాట్లాడుతూ ఎవరైనా అనుమానాస్పదంగా కనబడిన, ఏమైనా బ్యాగ్‌లు, వస్తువులు కనిపించినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్లో వేగం పెంచండి

మేయర్ గుండు సుధారాణి


పోతననగర్‌లో అధికారులతో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 13: నగరంలో నిర్మిస్తున్న ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పనుల్లో వేగం పెంచాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. మంగళవారం బల్దియా పోతననగర్ సమీపంలోని చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్ సివిల్ పనులను అక్కడి అధికారులతో కలిసి పరిశీలించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా సుధారాణి మాట్లాడుతూ.. చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పెండింగ్ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, రాజయ్య, ఈఈ శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ సిబ్బంది, కాంట్రాక్టర్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో చైన్ స్నాచర్లు

మట్టెవాడ, ఆగస్టు 13: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈనెల 9న శ్రీనగర్‌కాలనీ రోడ్డులోని ఒంటరిగా వెళ్తున్న మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మూడు రోజులుగా వరంగల్ సీసీఎస్ పోలీసులు గాలించి, ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. నిందితులను మట్టెవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లంబజార్ ప్రాంతానికి చెందిన వారిగా గుర్తించినట్లు తెలిసింది. వీరు బంగారు దుకాణంలో బంగారు వస్తువులు తయారు చేసే వారని తెలుస్తోంది. ఇద్దరిలో ఒకరిని ఎల్లంబజార్‌లో, మరొకరిని హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకుని విచారిస్తున్న తెలిసింది.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 14 ఆగస్టు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

రాయపర్తి, ఆగస్టు 13 : మండలకేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులతో కలిసి హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు సెంటర్‌లో మానహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సూచన మేరకు ప్రతీ ఒక్కరు ఇంటి పై పంద్రాగస్టు రోజున జాతీయ జెండా ఎగురవేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా కార్యదర్శి రాపాక ప్రశాంత్, జక్కుల సందీప్, రాకేష్, నాగరాజు, సిద్దు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయపర్తిలో జాతీయ జెండాలతో విద్యార్థుల మానవహారం చేస్తున్న

రుణమాఫీ కాలేదని రైతుల ఆందోళన



ఊకల్ సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత రైతులు

గీసుగొండ, ఆగస్టు 13: ఊకల్ ఆంధ్రబ్యాంకు కర్షక సేవా సహకార సంఘం (ఊకల్ సొసైటీ)లో పనిచేసే ఉద్యోగుల నిర్లక్ష్యంతో 184 మందికి రూ. 2లక్షల లోపు రుణమాఫీ వర్తించని పరిస్థితి ఏర్పడిందని బాధిత రైతులు సొసైటీ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. దాంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. రైతుల కథనం ప్రకారం. ఊకల్ సొసైటీలో సంగెం, గీసుగొండ మండలాలకు చెందిన 13 గ్రామాలు రైతులు దాదాపు 3 వేల మంది సభ్యులుగా ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం రూ.2లక్షల లోపు రుణమాఫీ చేయటంతో అర్హుల జాబితాలో తమ పేర్లు లేకపోవటంతో ఖంగుతిన్నారు. బాధితులు అధికారులను వివరణ అడుగగా నాట్ ఫౌండ్ అని వస్తోందని పేర్కొన్నారు. దీంతో ఊకల్ సొసైటీకి వచ్చిన వారు సొసైటీనుంచి పై అధికారులకు పంపించిన రుణమాఫీ అర్హుల జాబితాను చూపించాలని పట్టుబట్టారు. అధికారులు చూపించిన జాబితాలో పేర్లు ఉన్నా, ఆధార్‌నంబర్‌లు తప్పుగా ఉన్నాయని రైతులు వాపోయారు.

ఆస్పత్రి భవన నిర్మాణం వెంటనే పూర్తిచేయాలి

(5వ పేజీ తరువాయి)

మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వైద్య కళాశాలకు సంబంధించిన 500 సీట్ల భర్తీకి అడ్మిషన్లు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆదేశాల మేరకు అక్టోబరు 1 నుంచి వైద్యకళాశాలలో తరగతులు ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన తరగతి గదులు తదితర సౌకర్యాలతో పాటు హాస్టల్ వసతి ఏర్పాటు మిగి లిన కళాశాల భవననిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపా దికన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశిం చారు. మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌దాస్, కిషన్‌నాయక్, జిల్లా ఆస్పత్రి పర్యవేక్షక అధికారి డాక్టర్ గోపాల్, ఈఈ ప్రసాద్, డాక్టర్లు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై కేసు పెట్టాలి

చెన్నారావుపేట. ఆగస్టు 13: ప్రభుత్వ భూమిని అక్రమణ చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడు పంజాల రమేష్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమీనాబాద్ గ్రామ శివారు పనికర గుట్ట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని పట్టాలు చేసుకున్నరన్నారు. ఆ భూమిని కబ్జా చేయటం కోసం గుడిసె వాసులపై కొంత మంది దాడులు చేస్తున్నరని అన్నారు. భూమిని అక్రమణ చేస్తున్న నవీన్‌రెడ్డిపై కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి అక్కపెల్లి రమేష్, నెక్కొండ మండల కార్యదర్శి కందిక చెన్నకేశవులు. దేవపాల, దండుగుల అశోక్, నీరటి రజిత, సింగం వెంకటలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పంపిణీ చేసేదెప్పుడో..?

» ఎదురుచూస్తున్న లబ్ధిదారులు » చోద్యం చూస్తున్న అధికారులు

చెన్నారావుపేట. ఆగస్టు 13: నెలనెలా అందించాల్సిన రేషన్ బియ్యాన్ని సంబంధిత రేషన్ డీలర్ రేషన్ బియ్యం అందించక పోవడంతో రేషన్ బియ్యం పంపిణీ కోసం లబ్ధిదారులు ప్రతీ రోజు ఎదురు చేస్తున్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలోని షాపు నెంబర్ 7లో సుమారు 700 రేషన్ కార్డులున్నాయి. ప్రతినెలా రేషన్ డీలర్‌కు అధికారులు 135 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని అందించేవారు. ప్రతీ నెల లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేస్తుండగా ఈ నెల 4న రేషన్ షాపును జిల్లా టాస్కుఫోర్స్ అధికారులు తనిఖీలను చేపట్టారు. తనిఖీల్లో స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించగా షాపులో అదనం గా మరో 2 క్వింటాళ్ల బియ్యం నిల్వ ఉన్నాయి. దీంతో అధికారులు డీలర్ వెంకటేశ్వర్‌పై 6ఏ కేసు నమోదు చేసి, రేషన్ బియ్యం పంపిణీని నిలిపివేశారు. వెంటనే డీలర్ ఈ పాస్ యంత్రాలను సైతం స్వాధీనం చేసుకొని అధికారులు తీసుకెళ్లారు. అప్పటి నుంచి ఈ నెలలో రేషన్ షాపు నిర్వహణ చేయడం లేదు. అధికారులు రేషన్ షాపు బాధ్యతలను పక్క డీలర్‌కు సైతం అప్పగించకపోవడంతో బియ్యం పంపిణీ పూర్తిగా నిలిచిపోయింది. గత పది రోజులుగా రేషన్ బియ్యం పంపిణీ లేక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు రోజులైతే రేషన్ బియ్యం పంపిణీని ముగిస్తుందని. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ఫణికుమార్‌ను వివరణ కోరగా ఇన్‌చార్జి డీలర్ నియామకం చేస్తామని నేటి నుంచి లబ్ధిదారులకు రేషన్ బియ్యంను పంపిణీ చేస్తామని తెలిపారు.



ఉప్పరపల్లిలో మూసి ఉన్న రేషన్ షాపు

ఆరోగ్య మహిళా కార్యక్రమంతో మెరుగైన సేవలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న వెంకటరమణ

ఖానాపురం, ఆగస్టు 13: ఆరోగ్య మహిళా కార్యక్రమంతో మహిళలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందించడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని(పీహెచ్‌సీని) ఆయన మంగళవారం సందర్శించారు. పీహెచ్‌సీలో మహిళల కోసం ప్రత్యేకంగా ప్రతీ మంగళవారం కొనసాగుతున్న ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల్లో అనారోగ్య సమస్యలను తొలి దశలోనే గుర్తించి ఎనిమిది రకాల వైద్య సేవలు అందించడానికి మహిళా ఆరోగ్య కార్యక్రమం ఎంతగానో దోహదపడుతోందన్నారు. ఖానాపురం పీహెచ్‌సీలో మహిళా డాక్టర్ ఉండడం వల్ల మహిళలకు ఎక్కువ వైద్య సేవలు అందుతాయని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమ తెరలు వాడాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికా రులు అరుణ్, జ్యోతి, రుచిత, కల్పన, రాజయ్య, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

రాయపర్తి, ఆగస్టు 13 : ప్రమాదవశాత్తు అదుపు తప్పి లారీ బోల్తా పడిన సంఘటన మండలంలోని మైలారం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మైలారంలోని వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై అదుపు తప్పి లారీ పడడంతో డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలు కాగా స్థానికులు ఆస్పత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మైలారంలో లారీ బోల్తా పడిన లారీ

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చెన్నారావుపేట, ఆగస్టు 13: రోడ్డు ప్రమాదంతో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై గూడ అరుణ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి వరంగల్‌లోని నిజాంపురలోని చార్‌బౌలికి చెందిన సయ్యద్ అఫ్రాన్ (21) అనే వ్యక్తి ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. తన మిత్రుడితో కలిసి సోమవారం సాయంత్రం మండలంలోని గురిజాల గ్రామంలో ఓ ఇంట్లో ఏసీ రిపేర్ చేయడానికి వచ్చాడు. పని ముగించుకొని తిరిగి వరంగల్‌కు ఇంటికి ద్విచక్ర వాహనంపై వెళుతున్న క్రమంలో గ్రామ శివారులో లోలెవల్ వంతెన వద్ద ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీ కొట్టుకున్నాయి. దీంతో సయ్యద్ అఫ్రాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కాగా మృతుడి తండ్రి హైమద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సదరం శిబిరంలో దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు

వర్ధన్నపేట , ఆగస్టు 13: వర్ధన్నపేటలోని ప్రభుత్వ ఆస్పత్రిలో సదరం శిబిరం మంగళవారం నిర్వహించారు. ఇందులో దివ్యాంగులకు నిర్ధారణ పరీక్షలు చేశారు. దివ్యాంగులకు గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయం నుంచి సర్టిఫికెట్లను ప్రదానం చేయనున్నట్లు డాక్టర్లు చెందూ నాయక్, భరత్‌లు తెలిపారు. కార్యక్రమంలో నర్సింహారెడ్డి, వేణు, వీరయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహస్వామి, డీఆర్‌డీఏ సదరం విభాగం అధికారులు శైలజకిరణ్, సూపరింటెండెంట్ డాక్టర్ రామమూర్తి పాల్గొన్నారు.

పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



జాతీయజెండా విక్రయాలను ప్రారంభిస్తున్న పోస్టల్ అధికారులు

పర్వతగిరి, ఆగస్టు 13: పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని నర్సంపేట పోస్టల్ సబ్‌డివిజనల్ ఇన్‌స్పెక్టర్ సుచేందర్ అన్నారు. మంగళవారం మండలంలోని కల్లెడ గ్రామంలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని గ్రామ బీపీఎం రాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుచేందర్ మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనీల్‌రావు, మండల అధ్యక్షుడు శ్రీని వాస్‌నాయక్, నాయకులు పరమేశ్వర్‌రావు, శ్రీనివాస్, రమేష్, కార్యదర్శి మాధ వుడు, సిబ్బంది మౌలానా, నసీర్, రాజు, భగీరథరెడ్డి, రమణ, వేణు, రవి పాల్గొన్నారు.

ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు



ఆయిల్ పాం మొక్కలను నాటుతున్న సంగీతలక్ష్మి, తదితరులు

వర్ధన్నపేట, ఆగస్టు 13: ఆయిల్ పాం సాగుతో అధిక లాభాలు వస్తాయని జిల్లా ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి అన్నారు. మంగళవారం వర్ధన్నపేట గ్రామంలోని అల్లమనేని హేమచందర్‌రావు వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ పాం మెగా ప్లాంటేషన్‌కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంగీత లక్ష్మి మాట్లాడుతూ రైతులు ఆయిల్ ఫాం పంట సాగుకు ముందుకు రావాలని, పంటకు ఉన్న 90 శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీ జనరల్ మేనేజర్ సతీష్ నారాయణ్, వర్ధన్నపేట ఉద్యాన అధికారి తిరుపతి, ఉద్యాన శాఖ టెక్నికల్ అధికారి రాకేష్, ఆయిల్ ఫాం ఫీల్డ్ ఆఫీసర్లు దేవరాజ్, రిషి, ప్రణయ్‌తోపాటు రైతులు పాల్గొన్నారు.

గొర్రెకుంట పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్ బహూకరణ

గీసుగొండ, ఆగస్టు 13: గొర్రెకుంట జెడ్పీ పాఠశాల పూర్వ విద్యార్థి నమిండ్ల సాధన్ పాఠశాలకు ఆర్‌వో మినీ వాటర్ ప్లాంట్‌ను మంగళవారం బహూకరించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న సాధన్ పాఠశాలకు ఆర్‌వో ప్లాంట్‌ను బహూకరించినందుకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను కల్పించేందుకు పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని హెచ్‌ఎం కోరారు. కార్యక్రమంలో నాయకులు క్లైమెంట్, మాచర్ల కార్తీక్, సిలువేరు రవి, ఇంద ఆరోగ్యం, సుమన్, ప్రవీణ్ పాల్గొన్నారు.



ఆర్‌వో ప్లాంట్‌ను బహూకరిస్తున్న సాధన్



పోస్టు కార్డులు చూపుతున్న విద్యార్థులు

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

నల్లబెల్లి, ఆగస్టు 13 : విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట వెంటనే విడుదల చేయాలని దళిత విద్యావం తుల వేదిక జిల్లా కార్యదర్శి బట్టు సాంబయ్య అన్నారు. మంగళవారం రంగాపురం హైస్కూల్‌లో విద్యార్థులతో పోస్టు కార్డులను ప్రారంభించి నల్లబెల్లి పోస్ట్ ఆఫీస్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డికి పంపించారు. ఈ సందర్భంగా బట్టు సాంబయ్య మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐఎఫ్‌డీఎస్ నాయకుడు మార్త నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ క్యాడెట్లతో తిరంగ యాత్ర

వర్ధన్నపేట, ఆగస్టు 13: వర్ధన్నపేట మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ఎన్‌సీసీ వరంగల్ యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ ఆదేశం మేరకు ఎన్‌సీసీ క్యాడెట్లు మంగళవారం తిరంగా యాత్ర ర్యాలీని ఘనంగా నిర్వహించారు. దేశ ఔన్నత్యాన్ని చాటారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్ నిమ్మ మనుజేందర్‌రెడ్డి, హెడ్ మాస్టర్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

పర్వతగిరి, ఆగస్టు 13: పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఏ.గోవిందరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము దాచుకున్న జీపీఎఫ్ నిధులను, మెడికల్ బిల్లులను, పెన్షనరీ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీస్ సమస్యను సత్వరమే పరిష్కరించి కామన్ సీనియారిటీ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఎంఈవో, డైట్ లెక్చరర్, ఉప విద్యాశాఖ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికపై నియామకం చేయాలని, లేకపోతే ప్రభుత్వ విద్యారంగం తీవ్రంగా నష్టపోతుందన్నారు. ఈకార్యక్రమంలో జిల్లాకార్యదర్శి మహంకాళి రామస్వామి, బి.శ్రీధర్, ఎల్ల రాజు, జి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

బోజెర్వు యువకుడి ప్రతిభ

చెన్నారావుపేట, ఆగస్టు 13: మండలంలోని బోజెర్వు గ్రామానికి చెందిన ఓ యువకుడు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమీషన్‌లో ఉద్యోగం సాధించాడు. గ్రామానికి చెందిన అంగోతు అరుణ- భద్రయ్య దంపతుల కుమారుడు అంగోతు సంతోష్ ఇండియన్ బ్యూరో అఫ్ మైన్స్‌లో ఇంజనీరింగ్‌గా ఎంపికయ్యాడు. జాతీయ స్థాయిలో 34వ ర్యాంకు సాధించి అద్భుతమైన ప్రతిభ కనపరిచాడు. ఇతడికి చత్తీస్‌గఢ్ ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా పలువురు యువకున్ని అభినందించారు.

సఖీ సేవలపై అవగాహన

పర్వతగిరి, ఆగస్టు 13: సఖి కేంద్రం అందించే సేవలపై మంగళవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆయా గ్రామాల ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సఖీ సెంటర్ ప్రతినిధి శోభారాణి మాట్లాడారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ ఉదయ్‌రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

పంట క్షేత్రాలను సందర్శించిన జిల్లా వ్యవసాయాధికారి



మొండ్రాయిలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

సంగెం, ఆగస్టు 13: వాతావరణ ఆధారిత సలహాలు, సూచనలను రైతు వేదికల వద్ద వ్యవసాయ విస్తరణాధికారులతో నివృతి చేసు కోవాలని జిల్లా వ్యవసాయాధికారి డి.ఉష సూచించారు. మంగళవారం మొండ్రాయి, ముమ్మడివరం, గొల్లపల్లె, పల్లార్‌గూడ, సంగెం గ్రామాల్లోని వ్యవసాయ పంట క్షేత్రాలను ఉమ్మడి జిల్లా కన్సల్టెంట్ జాతీయ ఆహార భద్రత మిషన్ అధికారి సీఎచ్ కృష్ణారెడ్డి, రైతులకు సలహాలను, సూచనలను అందించారు.

మృతుడి కుటుంబానికి సాయం

సంగెం, ఆగస్టు 13: కాట్రపల్లిలో ఇటీవల మృతిచెందిన మేకల సత్యం ముదిరాజ్ కుటుంబానికి మెపా(తెలంగాణ ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అండగా నిలిచి నిత్యావసర వస్తువులను అందించింది. మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రాష్ట్ర అధ్యక్షుడు పుల దేవేందర్ మాట్లాడుతూ పేద కుటుంబానికి చెందిన సత్యం మృతితో కుటుంబం వీధిన పడే అవకాశం ఉందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దండు చిరంజీవి, రామకృష్ణ నీరటి రాజు, రావుల రాణాప్రతాప్, రావుల ఎల్లయ్య, కేశబోయిన యాదగిరి,చెక్క. సాంబమూర్తి పాల్గొన్నారు.



నిత్యావసర వస్తువులను అందిస్తున్న మెపా నాయకులు

విజయదండోరా ర్యాలీకి తరలివెళ్లిన నర్సంపేట ఉద్యమకారులు

నర్సంపేట టౌన్, ఆగస్టు 13 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పుకు కృతజ్ఞతగా హైదరాబాద్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విజయ దండోరా ర్యాలీకి నర్సంపేట నియోజకవర్గానికి ఎస్సీ వర్గీకరణ ఉద్యమ ప్రతినిధులు తరలివెళ్లారు. ర్యాలీకి తరలివెళ్లిన వారిలో ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రతినిధులు కల్లెపెల్లి ప్రణయ్‌దీప్, జాతీయ నాయకులు విజయ్ సిద్దు, రాజశేకర్‌బాబు, అజయ్‌దేవగన్, తడుగుల విజయ్, తదితరులు ఉన్నారు.

కొల్లూరు రేవంత్ మృతిపై విచారణ జరిపించాలి

వర్ధన్నపేట, ఆగస్టు 13: పర్వతగిరి మండలానికి చెందిన కొల్లూరు రేవంత్‌కుమార్ మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని టీడీపీ వర్ధన్నపేట నియోజక వర్గ ఇన్‌చార్జి చాడా మరియా-సురేఖ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రేవంత్‌కుమార్ మృతి చెంది రెండు నెలలు కావస్తున్నా దోషులను అరెస్టు చేయలేదని మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు టీడీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

నర్సంపేట టౌన్, ఆగస్టు 13 : నర్సంపేట మండలం రాజేశ్వర్‌రావుపల్లె గ్రామంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయురాలు సోమంచి ఉమాదేవి మంగళవారం టై, బెల్టులను, పాఠశాలకు ఎలక్ట్రిక్ బెల్‌ను బహుకరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈదుల వీరస్వామి, ఏపీసీ చైర్‌పర్సన్ బొజ్జ రాజక్క, పంచాయతీ కార్యదర్శి రజియ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌ల పంపిణీ

ఖానాపురం, ఆగష్టు 13: మండలంలోని అశోక్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హార్ట్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్లేట్లు, గ్లాస్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రామకృష్ణ, శ్రీహరి, రాఘవేంద్రశిల్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మందపల్లి సొసైటీ సీఈవో సస్పెన్షన్

దుగ్గొండి, ఆగస్టు 13: రైతు రుణమాఫీ విధానంలో భాగంగా రైతుల రుణాలను రెన్యూవల్ చేయకుండా మాఫీ ప్రతిపాదనలు పంపి విధుల పట్ల నిర్లక్ష్యం వహించినందుకు మండలంలోని మందపల్లి పీఏసీఎస్ సీఈవో కొంకటి రాజును సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ గడువులో రైతుల పంట రుణాలు రెన్యూవల్ చేయలేదని సహకార సంఘాల డైరెక్టర్ ప్రత్యేక నివేదిక సమర్పించగా దాని ఆధారంగా సీఈవోను సస్పెండ్ చేశారు. దుగ్గొండి పీఏసీఎస్ సీఈవో ఆరెల్లి భిక్షపతికి మందపల్లి పీఏసీఎస్ ఇన్‌చార్జిగా నియమించినట్లు డీసీవో సంజీవరెడ్డి ఉత్తర్వులో పేర్కొన్నారు.

బీజేవైఎం మండల కమిటీ నియామకం

దుగ్గొండి, ఆగస్టు 13: మండల బీజేవైఎం మండల కమిటీ నియామకం ఉత్తర్వులు మంగళవారం బీజేవైఎం మండల అధ్యక్షుడు ఈర సందీప్‌కుమార్ అధ్యక్షతన నర్సంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీజేపీ నాయకుడు గోగుల రాణాప్రతాప్ రెడ్డి అందించారు. మండల బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా జంగం నర్సింగం, ఉపాధ్యక్షులుగా అంబరగొండ సంతోష్, పులిచేరు రమేశ్, మాదం భాస్కర్, కార్యదర్శిగా ఇజ్జగిరి వేణుమాధవ్‌లను నియమించినట్లు గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు.

గణిత పుస్తకాల పంపిణీ

చెన్నారావుపేట, ఆగస్టు 13: మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సులభ గణిత పుస్తకాలను మంగళవారం అందించారు. ములుగు జిల్లా పత్తిపల్లి పాఠశాలలో పని చేస్తున్న గణిత ఉపాధ్యాయుడు మురళీధర్ ఆధ్వర్యంలో అందించిన గణిత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయ, శశిధర్, సంతోష్‌కుమార్, పిన్నింటి బాలాజీరావు. ఉదయ్‌కుమార్, మొగిలి, రమాదేవి, సతీష్‌కుమార్, స్వప్న, జాహెద్ తదితరులు పాల్గొన్నారు.